# పాపం! కొరియర్ అబ్బాయి...!!

'గార్దభ' అవార్డు గ్రహీత గాడిదల గురవయ్య ఉదయం నుంచి చాలా తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. తన కవితకు మంచి పాయింట్స్ తట్టడం లేదు. అప్పటికీ ఓ పెగ్గుకూడా లాగించేడు. గాలిలో చేతులు తిప్పుతూ, మధ్యలో తల ఎగురవేస్తూ చిత్ర విచిత్ర విన్యాసాలు ప్రదర్శిస్తూ అటూ, ఇటూ పచార్లు చేయసాగాడు. ఎన్ని వేషాలేస్తున్నా... ప్చ్... లాభం లేకుండా పోయింది. జేబులోనించి దువ్వెన తీసి బట్ట తలమీద ఉన్న నాలుగు వెంట్రుకలు రాలిపోయేలా గబ గబ దువ్వాడు. ఇంతలో సెల్ మోగింది.ఆన్ చేశాడు.

"హలో, గుడ్‌మార్నింగ్ సార్..." అంటూ ఓ ఆడ గొంతు తియ్యగా విష్ చేసింది. గురవయ్య మనసు ఆనందంతో గంతులు వేసింది.

"హలో! మేడమ్, చెప్పండి" అన్నాడు వంకరలు తిరిగిపోతూ.

"ఏమీ లేదండీ...! ఈ మధ్య మీ జి.జి మెమోరియల్ అవార్డ్ (అనగా గాడిదల గురవమ్మ స్మారక అవార్డ్) తీసుకున్నాను కదా!... దాని తాలూకు ఫోటోలు పంపుతారేమోనని..." అంటూ నసిగింది.

"అయ్యో! మేడమ్ ఎంతమాట అన్నారండి...? మీ ఫోటోలు ఎప్పుడో కొరియర్‌లో పంపేశాను. అయితే మీకింకా చేరలేదన్నమాట. అన్నట్టు మీ ఫోటోలు ఎంత బాగా వచ్చాయనుకున్నారు? మీరేమో ఎంచక్కా బొద్దుగా, ముద్దుగా ఉన్నారు" అంటూ చప్పరిస్తూ చెప్పాడు గురవయ్య.

"థాంక్యూ, సార్...!!" అని ఫోన్ పెట్టేసింది. నవలా రచయిత్రి నాగిని. ఈవిడ అసలు పేరు వీర వెంకట వరాహ నాగలక్ష్మి. ఈవిడ రాసే నవల్లు చదివి పాఠకులు నాగుపాముల్లా నాట్యం చేస్తున్నారని, ఈవిడకు 'నవలా నాగిని' అనే బిరుదు ఇచ్చారు.

అసలు ఫోన్లో నాగిని గొంతు వినగానే గాడిదల గురవయ్య మెదడులో వెయ్యి గాడిదల పరిమాణంలో ఫ్లాష్‌లు వెలిగాయి. ఫోన్ పెట్టేసి వెంటనే పూనకం వచ్చిన వాడిలా గబగబా రాయసాగాడు.

చింత చిగురులా నువ్వు...
చింత మొద్దులా నేను...
చక్రపొంగలిలా నువ్వు...
కొబ్బరి చెక్కలా నేను...
పట్టుకుచ్చులా నువ్వు...
పిచ్చికుక్కలా నేను...
కొంగ రెక్కలా నువ్వు...
కాకి రెట్టలా నేను..
నీలాకాశంలా నువ్వు...
నల్లి కీచులా నేను...

ఓసారి రాయడం ఆపి, చకచకా చదువుకొని 'ఎంత అద్భుతంగా కుదిరింది...? అనుకుంటూ, ఈసారి 'ప్రేమధీర' అవార్డు నాకే వస్తుందేమో' అని మురిసిపోయాడు గాడిదల గురవయ్య పదహారోసారి అద్దంలో

## జూటూరు కృష్ణవేణి

చూసుకుంటూ...!

'రాజహంస' కొరియర్ సంస్థ తాలూకు విక్రమ్ అనబడే కుర్రాడు కవర్‌మీద అడ్రస్ చదివాడు. మిస్.కె. నాగిని, ప్రముఖ నవలా రచయిత్రి, డోర్ నెంబర్ 5/534-1, పెద్ద మసీదు వీధి, గూడూరు-1.

'ఎక్కడుందబ్బా, ఈ ఇల్లు...? ఈ కాలనీలో ఐదు వందల ఇళ్ళు ఉన్నట్లు లేవే' అనుకుంటూ వేట మొదలుపెట్టాడు. చాలామందిని అడిగాడు. అడ్రస్ తెలీదని చెప్పారు. 'రెండొందల ఇళ్ళు కూడా ఉండవు, ఈ అడ్రసు తప్పు' అని కొంతమంది చెప్పారు.

ఏం చెయ్యాలో విక్రమ్‌కు అర్థంకాక, ఆలోచిస్తూ పరధ్యానంగా రోడ్డువార నిద్రపోతున్న కుక్కతోక మీద కాలేశాడు.

'భౌ భౌ'మని అరుస్తూ ఆ కాట్లకుక్క విక్రమ్ మీదికి దూకి వీరవిహారం చేసింది. దాని ధాటికి ప్యాంటు మోకాలిమీద చిరిగి పేలికలైంది. ఎంత విదిలించుకున్నా వదిలితే కదా!

ఈలోపు ఇద్దరు ఆడవాళ్ళు వచ్చి కుక్కని తరిమేశారు కాబట్టి సరిపోయింది. లేకపోతే అండర్ వేర్‌తో

రూమ్‌కు వెళ్ళాల్సి వచ్చేది అనుకుంటూ కనబడ్డ ఆటో లోకి దూరేశాడు.

అన్ని కవర్లూ డెలివరీ ఇచ్చేశాడు. ఒక్క నాగినీది తప్ప...!! కాబట్టి సరిపోయింది. ఆటో దిగి రూమ్‌లో పడిపోయాడు. ఆ రాత్రల్లా ఒకటే జ్వరం, ఒళ్ళు నొప్పులూ! కొంపతీసి కుక్క పళ్ళు దిగబడ్డాయో, ఏమిటో, అనుకుంటూ భయం భయంగానే డాక్టరు దగ్గరికి వెళ్ళాడు. డాక్టరు పరీక్ష చేసి టాబ్లెట్లు రాశాడు. రెండు చేతులకూ ఇంజక్షన్స్ వేశాడు. తెల్లారేసరికి చేతులు వాచి తేలు కుట్టినట్టు ఒకటే నొప్పి. చేతులు జివ్వున లాగుతుంటే, ఆ కుక్కను తిట్టుకుంటూ, రాజహంస ఆఫీసుకు వెళ్ళాడు.

''ఏవిటబ్బయ్యా! ఆ నెల్లూరు కొరియర్ ఇచ్చావా, లేదా...'' అడిగాడు ఓనర్ భూగోళం. పేరుకు తగ్గట్టు సార్ధక నామధేయుడు. ప్రపంచంలోని సమస్త సమాచారమ్సీ ఆయన బానపొట్టలోనే నవ నిధుల్లా నిక్షిప్తమై ఉంటాయని తెలిసిన వాళ్ళ ఉవాచ.

వంటింటినించి, విదేశీయానం దాకా అనర్గళంగా, గుక్కతిప్పుకోకుండా, మాట్లాడగలడు. భూగోళం వాగ్ధాటికి జడిసి రాజహంసకొరియర్ ఆఫీసు ఉన్న కటకరాజ వీధిలో నరసంచారం చాలా తక్కువే! కుక్కలు, పందులు లాంటి అల్ప జీవులకు కూడా ఆ వీధి అంటే అదురే! అడ్రస్ ఉండవు. ఆ వీధిలోకి ఎంటర్ అయితేమందు పాతరలు పేల్చే మావోయిస్టులు సైతం మటాష్ అయి పోవాల్సిందే! భూగోళం టంగ్ పవర్ అలాంటిది మరి...

''అడ్రస్ కనుక్కోడం చాలా కష్టంగా ఉంది, సార్...!! నిన్నంతా తిరిగాను, దొరకలేదు. ఆఖరికి కుక్క కూడా కరిచింది. ఇంజక్షన్ వేయించుకుని వచ్చాను...'' అన్నాడు దీనంగా, విక్రమ్.

''కుర్రపిల్లకాయవి, అబ్బాయా! కుక్కలకు, నక్కలకు భయపడేది ఏందయ్యా...? వాడెవుడో గాడిదల గురవయ్యంట, నాయినా! ఒకటే ఫోన్లు చేసి ప్రాణం తోడేస్తున్నాడయ్యా! దాని సంగతి తొందరగా చూడయ్యా!'' అన్నాడు.

ఆఫీసులోపలికి, మళ్ళీ డెలివరీ ఇవ్వాల్సిన కవర్లు తీసుకుని, నాగినీ కవరుతో సహా, నీరసంగా బయటకొచ్చాడు. పైన ఎండ నిప్పులు చెరుగుతోంది. అన్నీ కవర్లు ఎలాగో ఇచ్చేశాడు మళ్ళీ నాగినీ కవరు తప్ప... అంతరిక్ష పిశాచిలా ఈ కవరేమిట్రా బాబూ!... అనుకుని నెత్తి బాదుకున్నాడు విక్రమ్.

గులాబీ రంగు చుడీదార్‌లో సైకిల్ తొక్కుతూ, పట్టపగలు చందమామలాంటి అమ్మాయి చమ్కీబిళ్ళలా చమక్కన మెరుస్తోంది. విక్రమ్‌కు గుండె ఆగినట్లయింది. ఆ అమ్మాయినే దీక్షగా చూస్తూ వస్తున్న విక్రమ్ అరటి తొక్కమీద కాలేసి, జర్రున జారి సైడు కాలువలో పడ్డాడు. చమ్కీ పిల్లేమో కిసుక్కున నవ్వి, చటుక్కున మాయమైపోయింది. తల నేలకు బలంగా తగిలిందేమో, రక్తం కణతలమీదుగా కారింది.

ఆదారిన వెళ్ళేవాళ్ళు పాపం, గబగబ విక్రమ్‌ను లేవదీసి, ముఖం కడిగి, తుడిచి కర్చీఫ్‌తో కట్టు కట్టారు. ప్యాంటుకున్న బురద కడిగారు. ఓ కూల్‌డ్రింకు కూడా తాగించేరు. అప్పటికి కాస్త ప్రాణం లేచొచ్చిన విక్రమ్ చిన్నగా లేచి, అందరికీ థాంక్స్ చెప్పి ఆటోలో రూమ్‌కొచ్చాడు. కాలు బెణికి బూరెలా... వాచింది. కణతమీద దెబ్బకు ప్లాస్టర్ వేశారు. మరో నాలుగు ఇంజక్షన్లు పొడిచేసరికి చేతులు రెండూ గడ్డకట్టిపోయాయి. రెండు

## నానీలు

మాతృత్వాన్ని
వధించిన దృశ్యం!
చెత్తకుండీలో
నెత్తురుగుడ్డలో పసికందు!!

కామపిశాచి
బలిగొన్న దృశ్యం!
నగరశివారు పొదల్లో
యువతి శవం!!

ప్రేమోన్మాది
పైశాచిక చర్య!
ప్రేమించడంలేదని
యువతిపై యాసిడ్ దాడి!!

శాడీ ఇజం
రాక్షసకృత్యం!
పట్టపగలు చౌరస్తాలో
వ్యక్తి దారుణహత్య!!

మూర్ఖుడు చేసే
ముదనష్టపు చర్య!
తప్పతాగి
ఆలిని పెట్టే చిత్రహింస!!

— అగ్రహారం గోపాల్ శ్రీజాంకి

రోజులు మంచందిగలేకపోయాడు. రూమ్‌మేట్స్ సాయంతో గడిపేశాడు. ఈలోపు భూగోళం ఒకటే ఫోన్లు...!!

"ఆ బ్యాలెన్స్ కొరియర్ ఇచ్చేయి నాయనా! ఆ గాడిదల గురవయ్య నామీద కంప్లయింటు ఇస్తాడంట! ఒకటే బూతులు, చెవులు పాడయిపోయినాయి బాబూ!" అంటూ విక్రమ్‌ను ఉదరగొట్టేశాడు. ఆ గోల భరించలేక జ్వరం తగ్గీ తగ్గకుండానే, శవాన్ని భుజాన వేసుకున్న విక్రమార్కుడిలా బయల్దేరుతూ భూగోళానికి ఫోన్ చేశాడు.

"ఇదిగో, అబ్బాయ్! ఆ వీధికి మూడు దార్లున్నాయి. మొదటిది మన చిల్లకూరు శేషమ్మ స్కూలుందిగదా!... దాని పక్కనించి నేరుగా పోయి, కుడిచేతి పక్క, కరెంటు స్తంభం వెనక నుంచి, ముందుకు నాలుగు అడుగులేసి, మళ్ళీ కుడిచేతి పక్కన తిరగాలి. అక్కడ ఉండే డైరీ ఫారమ్ వెనక సందులోనే ఆ ఇల్లు...!! ఇకపోతే రెండోది... అళఘునాథస్వామి గుడి వెనక కరెంటాఫీసు వీధిలో నేరుగా పది అడుగులు వేసి, ఎడమ చేతి పక్కకు తిరిగితే తమ్మిశెట్టి గుంట వస్తుంది. దాని ఎదురు సందులోనే ఆ ఇల్లు. ఇకపోతే మూడోది... అని భూగోళం ఇంకా ఆ ఇంటి పురాణం కొనసాగించబోగా, విక్రమ్‌కు మెదడు గిరగిరా తిరిగినట్లయ్యి, "ఇంకొద్దు సార్... నాకర్థమైంది..." అంటూ ప్రాధేయపడ్డాడు.

"అమ్మయ్యా! అయినా, నాకు తెలీక అడుగుతున్నా, నీలాంటి కుర్రాళ్ళు, రేసు గుర్రాల్లా దూసుకోనిపోవాల కానీ ఇట్టా చతికిలపడకూడదయ్యా!" అన్నాడు భూగోళం.

'నా బొంద...! రేసుగుర్రమా, పాడా... కుంటి గుర్రాన్ని అయిపోతే...!! ఈ దిక్కుమాలిన కవర్ పుచ్చుకుని ఇంకో నాలుగు వీధులు తిరిగితే, శాల్తీని గల్లంతవ్వడం ఖాయం...!!' అని తిట్టుకుంటూ, "ఏంలేద్సార్! కాస్త హెల్త్ బాగాలేదు, అంతే...!!" అని ఫోన్ పెట్టేశాడు.

అక్కడ నాగిని ఫోన్ చేసి గాడిదల గురవయ్యాని "ఏమిటండీ! మీ కొరియర్ ఇంకా రాలేదు. 'తెలుగు కాగడా' మంత్లీకి ఈ ఫోటోలు త్వరగా పంపాలి. ఆ రిపోర్టరు రోజూ అడుగుతున్నాడు. నేను కాని త్వరగా పంపకపోతే ఆ 'గురక' (గుంజీల రమణీ కవిత) ఫోటోలు వేస్తాడట. నాకెంత నామోషీ, చెప్పండి...!!" అంటూ ఎడాపెడా వాయించేసింది.

గాడిదల గురవయ్య గుండెల్లో రైళ్ళు గాడిదల్లా పరిగెట్టాయి. ఎంతో ఆవేదనగా "మేడమ్! నేనెప్పుడయినా మీకు అబద్దాలు చెప్పానా...? నేను మీకు కొరియర్ పంపి రెండు వారాలైంది. మీ ఫోన్ వచ్చినప్పటినుండి, ఆ కొరియర్ వాళ్ళకి ఫోన్ చేసి తిట్టిపోస్తూనే వున్నాను. మీ అడ్రస్ తెలియక లేటయినట్టుంది. వచ్చేస్తుంది లెండి...!!" అంటూ ఓదార్చాడు.

విక్రమ్ చిల్లకూరు శేషమ్మ స్కూలు వెనుక దారిలో నడుచుకుంటూ వస్తున్నాడు. ఇంతలో "బాయ్యా! చిల్లరుంటే ఈ బాయ్యా...!" అంటూ ఓ తృతీయా ప్రకృతి శాల్తీ వాటేసుకుని ఉక్కిరి బిక్కిరి చేసింది. అసహ్యంతో విదిలించుకోబోతే వొదల్లేదు. పైపెచ్చు ఒళ్ళంతా చేతులతో తడుముతుంటే కంపరం పుట్టుకొచ్చి, జేబులో చెయ్యిపెట్టి చేతికందిన ఇరవైనోటు ఇచ్చి పరుగులాంటి నడకతో పక్కవీధిలోకి వచ్చిపడ్డాడు. స్పీడుగా నడిచాడేమో కాలునొప్పి మొదలయింది.

దూరంగా ఏదో షామియానా, కుర్చీలు, మనుషుల హడావిడి కన్పించింది. గబగబ అక్కడికి వెళ్ళి ఓ కుర్చీలో కూలబడ్డాడు. కాస్త ఒంటికి గాలి తగులుతోంది. నెమ్మదిగా ప్రాణం సేదతీరసాగింది కానీ ఆ సంతోషం ఎక్కువసేపు నిలవలేదు. మైకులో నుండి చెవిబద్దలయ్యేలాగా ఒకాయన బీభత్స, భయానక హావభావాలతో ఇలా చదువుతున్నాడు.

ఆవుదూడా...
ఆవకాయ...
ఆలూకర్రీ...
కాదేదీ కవితకనర్హం...
ఎగురుతోంది ఎర్రజెండా...
ఊగుతోంది, ఊహలదండ...
పదండి పోదాం...
పదండి ముందుకు...
సినిమా టిక్కెట్లకు... రైతు బజారుకు..
రేషను షాపుకు... రేసుగుర్రాలై...
పదండి తోసుకు పదండి ముందుకు...

విక్రమ్ చెవులు మూసుకొని, కళ్ళు తెరచి ఎదురుగా కనిపించే స్టేజివైపుకు చూశాడు. 'మహా కవి శ్రీశ్రీ శతజయంతి' ఉత్సవాల సందర్భంగా కవిసమ్మేళనం నిర్వహణ-గూ.ర.సం అనే బ్యానర్ తాటికాయలంతేసి అక్షరాలతో కనిపించింది.

'ఇంకాసేపు ఇక్కడే ఉంటే మెంటల్ రావడం గ్యారంటీ, అయినా గూరసం అంటే ఏమిటి చెప్మా? విరసం, నెరసం, తిరసం, అరసం వగైర్లు విన్నాను కానీ, ఈ పదం ఎక్కడా తగల్లేదే!' అనుకుంటూ, పక్కనున్న

ఓ పెద్ద మనిషిని అడిగేశాడు. ఆ శాల్తీ చిద్విలాసంగా నవ్వి "గూడూరు రచయితల సంఘం బాబూ...!!" అన్నాడు.

విక్రమ్ ఆపేరు వినగానే అక్కడి నుండి వెంటనే లేచి శరవేగంగా బయటకు పరుగెత్తాడు.

భుజాన బ్యాగ్‌తో విషాదంగా నడుచుకుంటూ, బహు దూరపు బాటసారిలా, భగ్నప్రేమికుడయిన సినిమా హీరోలా, వెళ్ళిపోతున్న విక్రమ్‌ని "విక్రమ్!" అంటూ ఎవరో పిలిచినట్లయింది. ఎవరా, అని వెనక్కు చూశాడు. తన ఫ్రెండ్ ప్రవీణ్, "ఎక్కడికిరా! బాగున్నావా...?" అంటూ కుశల ప్రశ్నలేశాడు.

విక్రమ్ "బాగున్నాన్రా! నువ్వేమిటి ఇక్కడ?" అని అడిగాడు.

"మా ఇల్లు ఈ వీధిలోనే రా! వెళ్దాం..." అంటూ బలవంతంగా లాక్కెళ్ళాడు. వాళ్ళింట్లో ఎవరూ లేరు. పెళ్ళికి వెళ్ళారట. విక్రమ్ ఫ్రెండుతో తన కష్టాలన్నీ చెప్పుకున్నాడు. ప్రవీణ్‌కు జాలివేసింది, మిత్రుడి బాధ చూడలేకపోయాడు. "పదరా, నేను కూడా వస్తా...! నా సైకిల్‌లో ఎక్కు! ఇద్దరం కలిసి వెతుకుదాం...!!" అన్నాడు.

ఇద్దరూ సైకిల్‌లో తిరుగుతూ వెతుకుతున్నారు. ప్రవీణ్ హఠాత్తుగా ఓ ఇంటి ముందాగి "ఇదేనేమో! చూడు, ఆ కవర్ ఇలా యివ్వు" అంటూ డోర్ నెంబర్ చూశాడు. 5/34-1 అని వేసి ఉంది. అంతేకాదు డోర్ మీద 'ఈ ఇల్లు అద్దెకి ఇవ్వబడును' అని కూడా రాసి వుంది. విక్రమ్ "నంబర్ ఇదికాదురా" అంటున్నా వినకుండా "అడిగి చూద్దాం" అంటూ తలుపు తట్టాడు.

ఓ మధ్య వయసు స్త్రీ తలుపు తీసింది. చాలా ఫ్యాషనబుల్‌గా బాబ్డ్‌హెయిర్, నైటీతో ఉంది, కానీ అమిత నల్లగా, లావుగా, పగలు చూస్తే రాత్రి కలలోకొచ్చేలా ఉంది. స్నేహితులిద్దరూ మొదటావిడను చూసి జడుసుకున్నారు. ప్రవీణ్ కాస్త తేరుకుని "నాగిని అంటే మీరేనా, మేడమ్...?" అన్నాడు.

"అవును...!!" అంది.

"మేడమ్! మీకో కవర్ వచ్చింది" అన్నాడు ప్రవీణ్.

"ఓ, అదా... ఇవ్వండి" అంది ఉత్సాహంగా.

"మేడమ్, ఇదేనా మీ డోర్ నెంబర్...?" అడిగాడు విక్రమ్.

"అవును" అంది ఆవిడ.

"అయితే కవర్‌మీద 5/534-1 అని ఉంది. ఇది రాంగ్ నెంబర్ కావడంతో మీ అడ్రస్‌కోసం చాలా కష్టపడ్డాం" అన్నాడు.

## గమ్యం

ప్రస్తుతం నా జీవిత గమ్యం మార్చాలని
వుంది
ఏ ఒక్క అర్హత లేక పుట్టాలనిపిస్తుంది
రెండక్షరాలు కూడా రాని విద్యను సంపాదించి
చిలక్కి చెప్పినట్టు చెప్పినా అర్థంచేసుకోని
దద్దమ్మలాంటి తెలివిని పొంది
క్రూరత్వాన్ని వంటపట్టించుకుని
దౌర్జన్యంతో దాడి చేస్తూ
ఆర్తి, సహానుభూతి, న్యాయం, సత్యం
ఏ ఒక్కటిని పాటించకుండా వస్తూ
పెద్దా-చిన్నా తేడాలు గమనించక
ధనంతో సర్వాన్నిపొందుతూ
నియమాలను ధిక్కరించే అధికారం చేస్తూ
పనికిమాలిన బ్రతుకు నడుపుతూ
సముద్రంలో దిగినా మోకాళ్ళవరకు మాత్రమే
నీళ్ళు తాకే పరమపాపిలా
నిండునూరేళ్ళు చల్లగా బ్రతకాలని వుంది
ఇలాంటి వాళ్ళకేగా ఈనాటి ప్రపంచం!
ఇలాంటి వాళ్ళకే కాదా అందరూ చూపించే
గౌరవం!!
వీళ్ళే కదూ నేడు పొందుతున్న మాన్యత!!

సోమ సురేశ్

"నేనేమో అడ్రస్ బాగానే చెప్పాను. కానీ ఆ గాడిదల గురవయ్యగారే కాస్త మందు మనిషి బాబూ! ఫోన్‌లో విని రాసుకోవడం పొరపాటు చేశారు" అంది నాగిని.

"ఈ ఇల్లు అద్దెకిస్తారా మేడమ్" అని అడిగాడు విక్రమ్.

"లేదు బాబూ! నేను సుప్రసిద్ధ నవలా రచయిత్రిని కదా! నాకు ఫ్యాన్స్ ఎక్కువైపోయారు. అభిమానుల తాకిడికి తట్టుకోలేక ఇలా రాశాం" అంది నాగిని సవిలాసంగా.

విక్రమ్ ఆవిడ మాటలు విని నిజంగానే కళ్ళుతిరిగి పడిపోయాడు.

పాపం....! కొరియర్ అబ్బాయి...!! ■